గోదారికి పోయేదెట్లా..!

- అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం
- ముందుకు సాగని పనులు

బాల్కొండ: మండలంలోని నాగాపూర్ నుంచి గోదావరి నది వరకు ఉన్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో గోదారికి పోయేదెట్లా అంటు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం వరకు గ్రామం నుంచి తారు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 1.55 కోట్ల నిధులను మంజూరు చేసింది. గతేడాది జూన్‌లో అట్టహాసంగా పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. రోడ్డు ఏర్పాటులో భాగంగా మట్టి రోడ్డుపై అవసరమైన చోట అక్కడక్కడ కల్వర్టులు నిర్మించారు.

ఇబ్బందుల్లో భక్తులు..

ప్రతి శుక్ర, సోమవారం రోజుల్లో పవిత్ర గోదావరి స్నానమాచరించడానికి భక్తులు అధిక సంఖ్యలో ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే గత ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది. కానీ పనులు మాత్రం నిర్లక్ష్యంగా జరగడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాగాపూర్ గ్రామస్తులు దాతల సహకారంతో అదే గోదావరి నది తీరన నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కూడా ప్రారంభయ్యాయి. దీంతో భక్తుల రద్దీ మరింత పెరగనుంది. కానీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి రోడ్డును తవ్వి కల్వర్టులను నిర్మించారు. దీంతో ప్రస్తుతం ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. గ్రామానికి వెళ్లే తారు రోడ్డు నుంచి గోదావరి నది వరకు సరిగ్గా కిలోమీటర్ దూరం ఉంటుంది. ప్రాజెక్టు తీర ప్రాంతంలోనే ప్రతి ఏడాది ప్రభుత్వం ఉచితంగా ప్రాజెక్ట్‌లో వదిలే చేప పిల్లలను వదులుతారు. దీంతో అక్కడి వరకు పెద్ద పెద్ద వాహనాలు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. కానీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో తిప్పలు తప్పడం లేదు. ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని భక్తులు, మత్స్యకారులు కోరుతున్నారు.


గోదావరి రోడ్డుపై నిర్మించిన కల్వర్టు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

గోదావరి రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. పనులు ప్రారంభించాలని ఇది వరకే కాంట్రాక్టర్‌కు సూచించాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా.
– వినీత్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ, బాల్కొండ

ఆలూరులో ప్రొటోకాల్ వివాదం

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు, బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వర్గీయుల మధ్య ప్రొటోకాల్ వివాదం నెలకొంది. దీంతో ఆదివారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల భూమి పూజ విషయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకునే అవకాశం ఉండడంతో పోలీసు సిబ్బంది మోహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.25 లక్షల నిధులు మంజూరు చేసింది. నిధుల మంజూరు విషయంలో పైచేయి చూయించుకోవడానికి ఇరు పార్టీల నేతలు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కృషి వల్లే నిధులు మంజూరైనట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. కాగా ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రస్తావించారు. అలాగే ఆయా నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించే విధంగా ప్రభుత్వం చొరవ చూపించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లడం వల్లే నిధులు మంజూరు అయ్యాయని బీజేపీ నాయకుల వంతైంది. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడానికి కాంగ్రెస్ నాయకులు సంకల్పించారు. భూమి పూజ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి రావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు. దీంతో బీజేపీ నాయకులు అడ్డుకుంటారనే సమాచారం ఉండడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు కాంగ్రెస్ నాయకులే అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. దీంతో బీజేపీ నాయకులు ప్రొటోకాల్ ప్రకారం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఎమ్మెల్యే అభివృద్ధి పనుల్లో పాల్గొనాల్సి ఉండగా ప్రజల చేత తిరస్కరించబడ్డ కాంగ్రెస్ నాయకులు అధికార జులుం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా వినయ్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసి నిధుల మంజూరుకు కృషి చేశారని ఆ పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు.

ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకపోవడం తగదు

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనుల భూమి పూజ విషయంలో ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహిస్తే సహించేది లేదని బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూరు గిరీశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తేనే రూ.25 లక్షల నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ నాయకులు తామే నిధులు మంజూరు చేయించినట్లు గొప్పలు చెప్పుకుంటూ ప్రొటోకాల్‌ను ధిక్కరించి ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా భూమి పూజ నిర్వహించడం తగదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు హరీశ్, అరుణ్, మహేశ్, నడిసరం మల్లయ్య, ప్రణీత్ గౌడ్, తేజ, భరత్, మహేశ్, సురేశ్ యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

మహిళలు ఐక్యంగా పోరాడాలి



వర్ని(మోస్రా): మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా మహిళలందరూ ఐక్యమై పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. మండలంలోని చింతకుంటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పోరాడి హక్కులు సాధించుకున్న రోజును మహిళా దినోత్సవంగా గుర్తించారని వెల్లడించారు. సమావేశంలో నాయకులు అంగలి పద్మ, నాగమణి, నర్సక్క, బిపాషా బేగం, మల్లేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



డొంకేశ్వర్: ఉపాధిహామీ పథకం ద్వారా మండల కేంద్రానికి మంజూరైన సీసీ రోడ్డు పనులు 13, 15 వీధుల్లో ప్రారంభమయ్యాయి. ఆదివారం ఎంపీటీసీ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గోక గంగారెడ్డి, రామాగౌడ్, బార్ల గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



వర్ని: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన తాహెర్‌బిన్ హందాన్‌ను రాష్ట్ర పీసీసీ డెలిగేట్ కునిపూర్ రాంరెడ్డి సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో తాహెర్‌ని కలిసి భవిష్యత్తులో పార్టీ పరంగా వ్యక్తిగతంగా ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. సాయిలు, రవి, విఠల్, ప్రకాశ్ గౌడ్ ఉన్నారు.

జ్యోతిష శిరోమణి అవార్డు అందజేత



రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన మఠం దీపక్ స్వామి ఆదివారం జ్యోతిష శిరోమణి అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతిష బ్రహ్మ, యూనివర్సిటీ ప్రొఫెసర్ నర్సింహా స్వామి అవార్డును ప్రశంసపత్రాన్ని అందజేశారు. జ్యోతిష్య శాస్త్రంలో పలు అవార్డులు అందుకుని గ్రామానికి రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు దీపక్ స్వామికి అభినందనలు తెలిపారు.

వీడీసీ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి



బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా దొనకంటి లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. గ్రామపెద్దలు, గ్రామస్తులు ఆదివారం నిర్వహించిన సమావేశంలో గ్రామాభివృద్ధి నూతన కమిటీను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొనకంటి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా మంద నాగరాజు, కోశాధికారిగా మద్ది అబ్బయ్య, ఉప కార్యదర్శిగా గాండ్ల గణేశ్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ర్యాలీ



మాక్లూర్: చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ మండలంలోని దుర్గానగర్ కింది తండాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సరిత ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో విద్యార్థులు ముందుగా గ్రామంలోని అన్ని వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. చెట్లకు నీరు పోశారు. అనంతరం తెయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డి సుమలత, శ్వేత, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మాతృశ్రీ పాఠశాల ఫేర్ వెల్ డే సెలబ్రేషన్స్ ఏఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యాలయాలు దేవాలయాల వంటివని, విద్యార్థులు గురువులు చెప్పిన చదువును ఆవలింపు చేసుకోవాలని, నిర్లక్ష్యంతో కూడిన విద్య భవిష్యత్తును అంధకారం చేస్తుందని సూచించారు. విద్యాభ్యాసంలో పదో తరగతి కీలకమైందని ఇక్కడి నుంచే విద్యార్థి భవిష్యత్తు నిర్ధారణ అవుతుందని ఇక్కడ నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధ, క్రమశిక్షణతో చదివి మంచి ఉత్తీర్ణత శాతాన్ని నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగ్‌నాథ్, పాఠశాల కరస్పాండెంట్ సిరిగిరి దిగంబర్‌రావు, విద్యావికాస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, తెలుగు పండిట్ అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసిన అతిథులు

క్రీడాపరికరాల అందజేత



బాల్కొండ: ముప్కాల్ మండలంలోని వేంపల్లిలో యువజన సంఘాలకు డీసీసీ ఉపాధ్యక్షుడు రాజు కుమార్ క్రీడా పరికరలను ఆదివారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాడులను ప్రతిఘటిద్దాం

కమ్మర్‌పల్లి: సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటిద్దామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క పిలుపునిచ్చారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్‌లో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెక్క మాట్లాడుతూ.. మహిళలకు ఇంటా, బయట తీవ్ర వివక్ష ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సురేశ్, సత్యనారాయణగౌడ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం 'స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ.. కాలనీని స్వచ్ఛ కాలనీగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీవాసులు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మార్వో విజయ్ కుమార్, ఆర్మూర్ డిప్యూటీ ఎమ్మార్వో విక్రం, శివారాజ్, రాజేందర్‌గౌడ్, ఎస్సారెస్పీ డీఈ గణేశ్, కమలాకర్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కాలనీ సభ్యులు

కేంద్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుతం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హర్యానా, పంజాబ్‌కు చెందిన రైతులు శాంతియుతంగా ఢిల్లీ యాత్ర చేపడితే వారిపై కాల్పులు సరైంది కాదన్నారు. దీనికి మోదీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. మరణించిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించే సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజా మొహినుద్దీన్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, దేవన్న, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దాసు

కమ్మర్‌పల్లికి చేరిన పాదయాత్ర

కమ్మర్‌పల్లి: హిందూ సనాతన ధర్మ పాదయాత్ర పేరిట అయోధ్యకు బయలుదేరిన ఓ స్వామీజీ పాదయాత్ర ఆదివారం కమ్మర్‌పల్లికి చేరింది. దీంతో స్థానికులు స్వామీజీకి ఘన స్వాగతం పలికారు. కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి మఠం నుంచి ఆరేళ్ల క్రితం బయలుదేరిన లక్ష్మీపతి స్వామీజీ పాదయాత్రగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మీదుగా అయోధ్యకు వెళ్తున్నట్లు చెప్పారు. స్వామీజీకి కమ్మర్‌పల్లిలో ఆతిథ్యం ఇచ్చారు. హిందూ సనాతన ధర్మం కోసం పాదయాత్ర చేస్తున్నట్లు స్వామీజీ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించారు. దీంతో గ్రామంలో రూ.10 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణం, రూ.10 లక్షలతో ఇందిరమ్మ కాలనీలోని మురికి కాలువల నిర్మాణం, రూ.5 లక్షలతో శివలింగయ్య ఆలయ ఆవరణలో షెడ్డు నిర్మాణానికి నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు డేగ పోశెట్టి, కళ్లెం మల్లారెడ్డి, నవనీత్, ఉదయ్, ముత్యం, నారాయణ, భాస్కర్, సంజీవ్, వంశీ, పవన్, మహేశ్, శ్రీకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న నాయకులు

జీరో బిల్లులు అందజేత


నాగాపూర్‌లో జీరో బిల్లులు అందిస్తున్న నాయకులు

బాల్కొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేరుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. మండలంలోని నాగాపూర్‌లో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లును ఆదివారం అందజేశారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక సీట్లతో గెలిపించుకుంటామన్నారు. మండలంలోని వన్నెల్(బి)లో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవేందర్, రఘుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధీకంపల్లిలో..


ధీకంపల్లిలో బిల్లులు అందిస్తున్న నాయకులు

మాక్లూర్: మండలంలోని ధీకంపల్లిలో విద్యుత్ వినియోగదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు జీరో బిల్లులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, కాలగడ్డ శ్రీకాంత్, కాలగడ్డ భరత్, నడుకుడ గంగారెడ్డి, శ్రీకాంత్, సురేందర్, గంగాధర్, చిన్నయ్య, భోజన్న, మహేశ్, సుబ్బులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన కవ్వా శంకర్ బెహ్రాయిన్‌లో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి స్థానికులు విరాళాలు సేకరించి రూ. 40 వేల నగదును ఆదివారం ఆదివారం అందజేశారు. శంకర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాన్కంపేట్‌లో..

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్‌లో ఉన్న ప్రైమరీ స్కూలులో అటెండర్‌గా విధులు నిర్వహించే బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ. పది వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశబూరు. స్కూల్‌లో 40 ఏళ్లకుపైగా పనిచేసి పేదరికంలో ఉన్న ఆయన కుటుంబానికి తమవంతుగా ఆర్థికసాయాన్ని అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జేమ్స్ గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు సొడ అరుణ్‌రాజ్, సభ్యులు గంగారెడ్డి, తాళ్ల మహిపాల్, తలారి నరేశ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


బాల్కొండలో ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు

బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి



జక్రాన్‌పల్లి: రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో ఆదివారం పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేపీ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు సందీప్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొప్పు రాజేందర్, సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ జగడం పోశన్న తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్ల నరికివేత


నాగంపేట్‌లో తొలగించిన చెట్ల కొమ్మలు

బాల్కొండ: మండలంలోని నాగంపేట్‌లో హరిత హారం మొక్కలు విద్యుత్ తీగలకు తగులుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు తొలగింపు పనులు చేపట్టారు. ఇది చూసిన పలువురు హరిత హారంలో భాగంగా మొక్కలు నాటుడెందుకు.. విద్యుత్ తీగలకు తగులుతున్నాయని నరుకుడెందుకు అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు దూరంగా మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) – 10.25
	శైతాన్ (హిందీ) – 1.15, 7.00
	బాబు (తెలుగు) – 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) – 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) – 12.30, 3.35, 6.40, 9.45

నేడు మోతెలో జాతర

వేల్పూర్: మోతె గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి జాతర సోమవారం ఘనంగా జరుగనుంది. జాతరకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక వీడీసీ సభ్యులు పూర్తి చేశారు. ప్రతి ఏటా శివరాత్రి తర్వాత మూడు రోజులకు ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పురాతన కాలంలో మహాశివరాత్రి ఉత్సవాలలో గ్రామస్తులు కాలినడకన వెళ్లి వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని, తిరిగి కాలి నడకన మూడు రోజులకు గ్రామానికి చేరుకొని జాతర నిర్వహించారని ప్రచారంలో ఉంది. ఇదే ఆచారాన్ని గ్రామస్తులు అనాదిగా పాటిస్తున్నారు. జాతర రోజు ఉదయం డప్పు వాయిద్యాలు, భాజాభజంత్రీలతో గ్రామంలోని ఆలయం నుంచి గుట్టవద్ద ఉన్న ఆలయానికి స్వామిని తీసుకెళ్తారు. ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు.



ముగిసిన యోగా శిక్షణ శిబిరం



పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని నాగలింగేశ్వర ఆలయ ఆవరణలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు, పతంజలి యోగా సమితి ఇందూరు జిల్లా అధ్యక్షుడు తొర్తి బుచ్చన్నను యోగా సాధకులు ఘనంగా సన్మానించారు. అనంతరం భారత్ స్వాభిమాన్ ట్రస్టు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్టు సభ్యులుగా జగన్మోహన్ రెడ్డి, కలిగోట్ గంగాధర్, మ్యాక పండరీష్, దార్ల చిన్న ముత్తెన్న, బొబిడె చంద్రశేఖర్, దొండి జయరాజ్, సురేందర్ రెడ్డి, కొక్కుల లింగం, దమ్మన్న స్వామి, హజారి ధర్మేందర్, లిక్కి శంకర్, కొడిచెర్ల అరుణ్, నరేందర్, నాగ రాములు, ప్రకాశ్, గణేశ్, గంగాధర్, విజయ్ తదితరులు ఎన్నికయ్యారు.

సమాచారం..

■ నేడు బడ్జెట్ సమావేశం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను అధ్యక్షతన కొనసాగుతుందన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

■ సిద్ధులగుట్టపై పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పేర్కొన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకి సేవ ఉంటుందని సభ్యులు వెల్లడించారు.